జగన్ మళ్లీ సీఎం కావాలి

- ఏపీఐఐసీ ఛైర్మన్, సమన్వయకర్త మెట్టు
- ఘనంగా 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు




మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' మెగా చెక్కు అందజేస్తున్న విప్ కాపు, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, హాజరైన మహిళలు

రాయదుర్గం: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బాగుండాలంటే మళ్లీ 'జగనే' సీఎం కావాలని ఏపీఐఐసీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రాయదుర్గం ఎంపీపీ విద్యావతి ఆధ్యక్షతన నాలుగో విడుత 'వైఎస్సార్ ఆసరా' సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి హాజరయ్యారు. అర్బన్, రూరల్ నుంచి వేలాదిగా అక్క,చెల్లెమ్మలు తరలివచ్చి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు మాట్లాడారు.. వైఎస్సార్ ఆసరా పథకం అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగో విడుతలో 4,498 డ్వాక్రా సంఘాలు అర్హత సాధించగా, 36,892 మంది సభ్యులకు రూ.27.23 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. అర్బన్‌లో 791 సంఘాల్లోని 7,910 మంది సభ్యులకు రూ.4.57 కోట్లు, రూరల్ లోని 597 సంఘాల్లోని 6,178 మంది సభ్యులకు రూ.3.46 కోట్లు విలువ చేసే మెగా చెక్కులను ఆవిష్కరించామన్నారు.

దగా కోరు చంద్రబాబు..

మహిళా సంఘాల రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామంటూ 2014 ఎన్నికల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తప్పుడు హామీలిచ్చి అక్క, చెల్లెమ్మలను దగా చేశాడని మెట్టు విమర్శించారు. నిర్వీర్య దశకు చేరిన సంఘాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ పథకాతో మళ్లీ ఊపిరిపోశారన్నారు. సంక్షేమ పాలన కావాలా..? జలగల్లా పీక్కుతినే జన్మభూమి కమిటీల్లాంటి రాక్షసత్వం కావాలో మీరే ఆలోచించుకోవాలన్నారు. టీడీపీ పగటి వేషగాళ్లు చెప్పే మాటలు నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ అభివృద్ధిపైనే మీ ఓటు ఉండాలన్నారు. అనంతరం విప్ మాట్లాడుతూ రాయదుర్గం ప్రజలు మూడు సార్లు ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించారని, ఎన్నటికీ వారి సేవలు మరిచిపోలేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టీ సిద్దప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ వలీబాషా, పట్టణ కన్వీనర్ అవర శివప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మెప్మ కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, వైకేపీ కోఆర్డినేటర్ గంగాధర, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జగనన్న వెంటే మహిళా సంఘాలు



ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి మా ఆర్థిక ఇబ్బందులను జగనన్న గట్టెక్కించారు. ఆయనకు మహిళా సంఘాల తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుంది. నాలుగేళ్లలో రూ.40 వేల రుణమాఫీ పొందాను.

– షహనాజ్‌బీ, డ్వాక్రా సభ్యురాలు, రాయదుర్గం

అన్నలా ఆదుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నలా ఆదుకున్నారు. ఆర్థికంగా ప్రోత్సహిస్తూ భరోసా కల్పించారు. నాలుగు విడుతల్లో రూ.36 వేల రుణమాఫీ పొందాం. జగన్‌ను మరోమారు సీఎంగా చేసుకుంటాం.

– రేష్మ, డ్వాక్రా సభ్యురాలు, రాయదుర్గం

సంక్షేమాన్ని ఇంటింటా వివరించండి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎంపీ, కళ్యాణదుర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం కంబదూరు మండలానికి చెందిన నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్టంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టగానే సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. జగనన్న చేసిన సంక్షేమాన్ని ప్రజలకు తెలపాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉంది అని అన్నారు. అర్హతే ప్రామాణికంగా సాగుతున్న సంక్షేమ పథకాల అమలు ఇలాగే కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. కంబదూరు మండలంలోని పలు పంచాయతీల్లో తాగునీటి సమస్య గురించి నాయకులు వివరించగా త్వరలోనే సమస్యలు ఆయన హామీ ఇచ్చారు.

పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన గృహసారథి మహేష్, చింతచెట్టు పై నుంచి కిందపడ్డ వైఎస్సార్‌సీపీ కర్యకర్త శ్రీరాములును ఆదివారం సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులకు సూచించారు.

నేడు ఎంపీ పర్యటన..

కళ్యాణదుర్గం/కంబదూరు: ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం 10 గంటలకు కంబదూరులోని మల్లీశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎంపీ పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కళ్యాణదుర్గంలోని పార్టీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, మధ్యాహ్నం 3.30 గంటలకు కళ్యాణదుర్గం రూరల్ మండల పరిధిలో నాయకులు, కార్యకర్తలో సమావేశం నిర్వహించనున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, డీలర్లు, వలంటీర్లు, నాయకులు హాజరు కావాలన్నారు.

21వ వార్డు ఇన్‌చార్జ్‌గా వాల్మీకి రఘు



మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు

రాయదుర్గం: పట్టణంలోని 21వ వార్డు ఇన్‌చార్జ్‌గా పైతోటకు చెందిన వాల్మీకి రఘును ను నియమిస్తున్నట్టు ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. పైతోట సమీపాన ఆదివారం ఆ వార్డు ప్రజలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మెన్ వలీబాషా, పట్టణ కన్వీనర్ అరవ శివప్పతో కలసి మెట్టు మాట్లాడారు. వార్డు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేసే వ్యక్తి రఘు అని కొనియాడారు. రఘు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మెట్టుతో పాటు పార్టీ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టీ సిద్దప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిలర్లు పైతోట వాల్మీకి సంజీవ, పద్మజ, పొరాళ్ల గోవిందరాజులు, షబ్బీర్, కొంతెం దేవరాజు, శ్రీనివాసరెడ్డి, గౌని లావణ్య, శారద, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివా, నిజామ్, బషీర్, ఇస్మాహిల్ పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం



మాట్లాడుతున్న డీఎస్పీ బీ శ్రీనివాసులు

రాయదుర్గం: ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేశామని కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాయదుర్గం పర్యటనకు వచ్చిన సందర్భంగా రూరల్ సీఐ ప్రసాద్‌బాబుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. సరిహద్దు మండలాల్లో 17 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పహారా పెంచామన్నారు. అక్రమంగా మద్యం, గంజాయి, డబ్బు తరలిస్తూ పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. రౌడీషటర్లు, అల్లర్లకు పాల్పడేవారు, సోషల్ మాధ్యమాల్లో రెచ్చగొట్టి గొడవలు సృష్టించేవారిపై నిఘా పెంచామన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాయదుర్గం పీఎస్‌లో సిబ్బంది కొరత విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం!



బీటీపీ రోడ్డులోని జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లు



కణేకల్లు రోడ్డు గౌడ లేఅవుట్‌లో జగనన్న గృహం

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో పేదోడి సొంతింటి కల సాకరమవుతోంది. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో పలుమార్లు అర్జీలు ఇచ్చినా స్థలం, ఇల్లు మంజూరు కాక, బాడుగ ఇళ్లలో బతుకీడ్చిన పేదలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. జగనన్న కాలనీల్లో పట్టా ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక చేయూత అందజేశారు. ఈ క్రమంలో రాయదుర్గం పట్టణంలో ఏర్పాటు చేసిన 14 జగనన్న కాలనీల్లో 3,962 మందికి స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేశారు. ఓ యజ్ఞంలా ఇంటి నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇప్పటి దాకా 2,390 ఇళ్లు పూర్తి కాగా మరో 68 ఇళ్లకు పైగా ఇళ్లు ఆర్‌సీసీ టాప్ వేసుకోగా మిగితావి వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జగనన్న కాలనీల్లో అద్భుతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని పలువురు లబ్ధిదారులు కలల సౌధంలో ప్రవేశించారు. సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్ పది కాలాల పాటు చల్లగా ఉండాలని లబ్ధిదారులు ఆశీర్వదిస్తున్నారు.



జగనన్న కాలనీల్లో జోరుగా ఇంటి నిర్మాణాలు

టీడీపీలో అంతర్మథనం!

- టికెట్‌పై నేతల్లో గుబులు
- ఉన్నం, ఉమాలకు ఈ సారి మొండిచేయి?
- తెరపైకి ఎస్‌ఆర్‌సీ అధినేత పేరు



తెరపైకి ఎస్‌ఆర్‌సీ అధినేత అమిలినేని..

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతల్లో అంతర్మథనం మొదలైంది. అధిష్టానం అభ్యర్థిని ప్రకటించంలో జాప్యం చేస్తుండటంతో టికెట్ ఆశిస్తున్న ఆశావహ నేతల్లో గుబులు మొదలైంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థి ఎంపికపై అధిష్టానం నోరు మెదపకపోవడంతో అందరిలో ఈసారి భయం పుట్టుకుంది.

ఉన్నం, ఉమాకు ఈసారి మొండిచేయి కళ్యాణదుర్గం టీడీపీ టికెట్‌పై ఈ సారి మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడుకు మొండిచేయి చూపే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చెబుతున్నాయి. ఎవరికి వారు అధిష్టానంతో టచ్‌లో ఉన్నామని ఇప్పటికే రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు డిపాజిట్ చేశామని ఉన్నం, ఉమా వర్గాలు వారి అనుచర వర్గాలతో చెప్పుకుంటూ ముందుకెళ్తున్నారు. అయితే ప్రజల్లోకి వెళ్లేందుకు తమకు టికెట్ ఇస్తారో.. లేదోనని లోలోపల మథన పడుతున్నారు. టికెట్ ఎవరికి ఇస్తారో అర్థం కాకపోవడంతో టీడీపీ శ్రేణులు అయోమయంలో పడ్డారు.

కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థిగా ఈ సారి ఎస్‌ఆర్‌సీ అధినేత అమిలినేని సురేంద్ర బాబు పేరును పరిశీలిస్తున్నట్లు వినికిడి. ఇందుకు ఇప్పటికే ఇరువర్గాలకు సూచనగా అమిలినేని పేరును తెరపైకి తీసుకువచ్చినట్లు టీడీపీ నేతలే చెబుతున్నారు. ఇందుకు బలాన్ని చేకూర్చుతూ కళ్యాణదుర్గంలో ఇప్పటికే ఎస్‌ఆర్‌సీ కంపెనీలో పనిచేసే కొందరు సిబ్బంది ఓటరు కార్డుల మార్పు, ఇంటిని గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. గత 2019 ఎన్నికల్లో టికెట్ ఊరించి చివరి నిమిషంలో చేజారిన నేపథ్యంలో 2024 ఎన్నికల్లో అభ్యర్థిత్వంపై అమిలినేని ఆచుతూచి అడుగులు వేస్తున్నారు. అధిష్టానం నేరుగా పేరును ప్రకటించే వరకూ ఎలాంటి ఆర్భాటం లేకుండా అంతర్గతంగా పార్టీ కార్యకలాపాలను చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అమిలినేనికి టికెట్ కేటాయిస్తే ఉన్నం, ఉమా వర్గీయులు సహకరిస్తారా? లేదా?అన్న మీమాంస ఇప్పుడు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో హాట్ టాఫిక్ గా మారింది.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం రాత్రి గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బందికి ఇబ్బందులుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే గ్రామాల్లో రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. ఎస్‌ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి: ఆర్డీటీ వాటర్‌షెడ్డు గ్రామాలు జంబుగుంపల, నిజవళ్లి పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ హనుమంతరాయుడు సూచించారు. ఆదివారం జంబుగుంపల గ్రామంలో రైతులు, మహిళా సంఘ సభ్యులకు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ శాఖ ప్రతినిధి శ్రీనాథ్, ఎస్టీఓలు రామాంజనేయులు, వెంకటేష్, సిబ్బంది, స్పెయిన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బంగారు నగల చోరీ

కూడేరు: స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న ఎల్లమ్మ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి 6 తులాల బంగారు లాంగ్‌చైన్, నగదు అపహరించుకెళ్లారు. కూడేరు బస్టాండ్ ప్రాంతంలో చిన్నపాటి దుస్తుల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఎల్లమ్మ... శనివారం అనంతపురంలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం కూడేరుకు చేరుకుని నేరుగా దుకాణం తెరిచి వ్యాపారంలో నిమగ్నమైంది. సాయంత్రం పక్కింటి వారి సమాచారం మేరకు ఇంట్లోకి వెళ్లి పరిశీలిస్తే బీరువాను బలవంతంగా తీసి అందులోని నగదు, బంగారు నగలు అపహరించుకెళ్లినట్లుగా నిర్ధారించుకుని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆటో బోల్తా .. తొమ్మిది మందికి గాయాలు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం సమీపంలో ఆదివారం సాయంత్రం ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలు కాగా మరో ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన హేమలత, సుకన్య, భాస్కర్, మరో ఐదుగురు గ్రామ వలంటీర్లు,ముగ్గురు చిన్నారులు ఆదివారం ఆటోలో గుంతకల్లు నుంచి పెన్నహోబిలం వెళ్లారు. సాయంత్రం తిరిగి గుంతకల్లుకు వస్తుండగా మార్గమధ్యం గూళ్యపాళ్యం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. గుంతకల్లు, వజ్రకరూరు మండలాలకు చెందిన 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు కార్యకర్తల సమావేశం

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి స్వగృహంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ గౌని లక్ష్మీ కాంతారెడ్డి ఆదివారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుడు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు మెంబర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పింఛన్ అందజేత



మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన ఎర్రక్క తీవ్ర అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ ఎర్రిస్వామి ఆస్పత్రికి వెళ్లి ఆదివారం పింఛన్ అందించారు. ఈ సందర్భంగా ఆమె వలంటీర్‌ను అభినందించడంతో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కూడేరు: మండలంలోని కొర్రకోడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లక్ష్మీ నారాయణ ఆదివారం తెలిపారు. కొర్రకోడు పంచాయతీ పరిధిలోని హంసాయపల్లి, కొర్రకోడు డ్యాం , కొర్రకోడు ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవేంద్ర



దేవేంద్రను సత్కరించిన వైఎస్సార్ సీపీ నేతలు

కూడేరు: మండలంలోని జల్లిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ మండల కన్వీనర్ దేవేంద్రకు కురుబ సంఘం జిల్లా కమిటీలో చోటు దక్కింది. ఆదివారం అనంతపురంలోని కనకదాస కల్యాణమండపంలో కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు తుప్పటి ఈశ్వరయ్య అధ్యక్షతన కమిటీ ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేంద్ర జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆయనను కురుబ కులస్తులు, కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు సత్కరించి అభినందనలు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ భవన్‌లో 2024 పండిత్ పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం విశ్రాంత తెలుగు పండితులు ఆవిష్కరించారు. తెలుగు విశ్రాంత పండితుడు విద్వాన్ మల్లికార్జున మాట్లాడుతూ తెలుగు బాషా ఔనత్యాన్ని చాటుతూ క్యాలెండర్ సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో పండిత పరిషత్ నాయకులు గంగాధర్, సుధాకర్, చంద్రాయుడు, అమరేంద్రకుమార్, భాస్కర్, గుగ్గిళ్ల రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని నార్త్ స్కూల్ అవరణలో ఆదివారం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ చేతుల మీదగా జన విజ్ఞాన వేదిక 2024 డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ గౌరవాధ్యక్షులు మల్లికార్జున, తిమ్మరెడ్డి, ఉపాధ్యక్షుడు చిత్తప్ప, నాయకులు రాజన్న, రాజగోపాల్, వన్నూరస్వామి, తిమ్మన్న యూటీఎఫ్ నాయకుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

దశభుజ గణపతికి పూజలు



అలంకరణలో దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

సిద్దప్పస్వామి ఆశ్రమంలో..

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లిలో సిద్దప్పస్వామి ఆశ్రమంలో వార్షిక పూజ మహోత్సవం నిర్వహించారు. ఆదివారం సిద్దప్పస్వామి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. అంతకుముందు ఆశ్రమంలో అభిషేకం , గంగపూజ, భజన చేపట్టారు.


నేడు సర్వసభ్య సమావేశం

రాయదుర్గం(డి హీరేహాళ్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ ఎం.పవిత్ర ఆదివాకం తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

బొమ్మనహాళ్‌లో 8న..

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు నిర్వహించనున్నట్లు ఎంపీపీ యు.పద్మ, ఎంపీడీఓ షకీలాబేగం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



రథాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. రథాన్ని ఆదివారం బయటకు తీసి మరమ్మతు చేపట్టారు. అలాగే ధ్వజారోహణం(ఉట్ల మాను జాతర)కు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు. 14వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు అన్ని వసతులు ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్త తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కుందుర్పి: వాహన డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వెంకటస్వామి సూచించారు. ఆదివారం కుందుర్పి, బెస్తరపల్లిలో పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ముఖ్యంగా మోటరు బైకులు నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. ఇతర వాహనాలు నడిపేవారు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, వాహన యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సాధన' పరిచయ సభ

కళ్యాణదుర్గం: స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రముఖ రచయిత శాంతి నారాయణ సాధన నవలా పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి, గౌరవ అతిథిగా ప్రధాన వక్త నాగేశ్వరచారి, రచయిత శాంతి నారాయణ, సభాధ్యక్షుడిగా డాక్టర్ ఎంటీ జ్యోత్స్న వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమానికి సాహిత్య అభిమానులు, పుర ప్రముఖులు, అధ్యాపకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కొర్రకోడులో సర్వే చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిపుణులచే వైద్య సేవలందిస్తూనే మరో పక్క కుష్టు వ్యాధి నిర్మూలనకు శ్రీకారం చుట్టింది. ఇంటింటా సర్వేకు చర్యలు చేపట్టింది. మండలంలో జనవరి 15 నుంచి వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే మొదలు పెట్టారు. మండలంలో 14 పంచాయతీలు, 28 గ్రామాలుండగా 40,150 మంది జనాభా ఉన్నారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీల పర్యవేక్షణలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు కలిసి ఇంటింటా తిరిగి చర్మంపై స్పర్శలేని, రాగి రంగుల్లో మచ్చలున్నా, కంటి కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోతున్నా, నరాలు వాపు ఎక్కితే కుష్టు వ్యాధికి సంకేతం కావచ్చన్నారు. ఆదివారం నాటికి 35,957 మందికి కుష్టు పరీక్షలు చేపట్టారు. ఇంకా 4,193 మందికి పరీక్ష చేయాల్సి ఉందని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 15లోపు అందరికీ పరీక్షలు చేస్తామని ఆయన తెలిపారు.